గాంధి తాతకు, ప్రేమతో

భరత భూమిన స్వేచ్ఛ నిండగ
ఆంగ్ల రాజ్యము అంత మొందగ
మంచి బాటను పోరి గెలిచిన
గాంధి తాతకు ప్రేమతో!

జగతి అంతయు శాంతి మెరయుగ
రామ రాజ్యం భువిని వెలయుగ
శక్తి నంతయు ధార పోసిన
మహిత ఆత్మా! వందనం.

నీవు వెలసిన పుణ్య భూమిని
మైల పరచిరి నేటి హీనులు,
కులము మతమని పెరిగె గోడలు
భరత శౌర్యం కృంగగా.

ధరణి నిండెను స్వార్థ చింతన,
మోసమెంతో ప్రబలి పోయెను,
మహిన నరకం అవతరించెను
నీదు మార్గం వీడగా.

నాడు కలిగిన దాస్య బంధము
నీదు మహిమన వీడి పోయెను,
నేటి తామస మంత మొందగ
మరలి రావా! దీక్షగా.

– భావన, Oct 2, 1996.